క్లుప్తంగా

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి సమూహ దేవాలయంలో మంగళవారం శ్రీవల్లిదేవ సేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని కల్యాణ మండపంలో షిరిడిసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేదపండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, ఉత్సవ మూర్తుల అలంకరణ చేశారు. అనంతరం వల్లి దేవ సేన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ట్రస్ట్ సభ్యులు మురళీమోహన్, సారధి, పద్మ, వసంతమ్మ, శశికళ, రాధమ్మ, సోము, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో ఆర్మీలో పక్కా ఉద్యోగం

కురబలకోట : ఎన్‌సీసీతో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సు కొలువుల్లో ప్రాధాన్యతతో పాటు పక్కాగా ఉద్యోగం లభిస్తుందని చిత్తూరు ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ మేజర్ బప్పేట్ అన్నారు. మంగళవారం అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీ సెలక్షన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెళ్లి కాని డిగ్రీ పూర్తి చేసి సీ గ్రేడ్ సర్టిఫికెట్ ఉన్న వారికి వేతనం కూడా రూ.56 వేలు పైనే ఉంటుందన్నారు. వీరి కోసం ప్రత్యేకంగా నియామకాలు ఉంటాయన్నారు. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి చక్కని భవితకు బాటలు వేసుకోవాలన్నారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు స్థానిక ఎస్ఐ రవీంద్రబాబును ఆదేశించారు. మంగళవారం ఆయన పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ రౌడీ షీటర్లు గ్రామాల్లో గొడవలకు ప్రేరేపిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. మండలంలో ప్రధానంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు, డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. శాంతి భద్రతలపై ఆరా తీస్తూ రాజీమార్గమే రాజమార్గంలా ప్రజా సమస్యలను సున్నితంగా పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

ఆలయ నిర్మాణానికి రూ. 50 వేలు విరాళం

పీలేరు రూరల్ : మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లె వద్ద నిర్మిస్తున్న శ్రీ అంకాలమ్మ ఆలయ నిర్మాణానికి రూ. 50 వేలు విరాళం అందజేశారు. మంగళవారం గాయంవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణంరెడ్డి కుమార్తె ప్రియారెడ్డి తన మొదటి నెల జీతం రూ. 50 వేలు ఆలయ నిర్మాణానికి అందజేశారు. అలాగే ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి రూ. 10వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ భవనం వెంకటరమణారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సులతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

కలికిరి : కంప్యూటర్ కోర్సులు చేసే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. కలికిరి పట్టణంలోని ఉర్దూ కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల కంప్యూటర్ శిక్షణను పూర్తి చేసుకున్న వారికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు క్రమం తప్పకుండా శిక్షణకు హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉర్దూ బాషాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని, భవిష్యత్తులో ఉర్దూ అకాడమీ సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి త్రోబాల్‌కు జ్ఞానాంబిక విద్యార్థి

మదనపల్లె : జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి పురుషోత్తం ఎంపికైనట్లు కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. మంగళవారం కళాశాలలో పురుషోత్తంకు అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ.. డిగ్రీ ప్రథమసంవత్సరం విద్యార్థి పురుషోత్తం తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచడంతో సెలెక్టర్లు రాష్ట్రజట్టుకు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశారన్నారు. ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పురుషోత్తం పాల్గొంటాడన్నారు. అలాగే ప్రథమసంవత్సరం బీసీఏ విద్యార్థిని భవ్యశ్రీ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైందన్నారు.

నాడు- నేడు పనులు పూర్తి చేయండి

రామసముద్రం: చిత్తూరు జిల్లా జెడ్పీ సమావేశంలో మంగళవారం రామసముద్రం జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి మండల సమస్యల పరిష్కారంపై విన్నవించారు. ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశంలో సిహెచ్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నాడు- నేడు కింద మంజూరైన వివిధ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే వాలీశ్వరస్వామి కొండకు రిటెండర్ వేసి టెండర్లను రూ.12 కోట్లకు పెంచాలని కోరారు.



మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయం నిర్వహణకు తాత్కాలికంగా సిద్ధం చేసిన భవనం

మదనపల్లె సిగలో
మరో కలికితురాయి





మదనపల్లెలో ఏర్పాటు కానున్న మెడికల్ కళాశాల స్థలం, బీటీ కళాశాల యూనివర్సిటీ ఏర్పాటుపై సీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

- ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో ఎడ్యుకేషన్ హబ్‌గా మదనపల్లె
- మెడికల్ కాలేజీ, బీటీ యూనివర్సిటీలతో పాటుగా కేంద్రీయ విద్యాలయం
- కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు పాలనాఅనుమతులు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం
- మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధికి సీఎం, ఎంపీ ఎనలేని సహకారం

మదనపల్లె : అన్నమయ్య జిల్లాలో విద్యానగరంగా ఎదుగుతున్న మదనపల్లె కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. మదనపల్లె మండలం వలసపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు పాలనాపరమైన అనుమతులు మంజూరు చేస్తూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇప్పటికే నియోజకవర్గంలో ఉన్నటువంటి నవోదయ విద్యాలయం, త్వరలో ఏర్పాటుకానున్న మెడికల్ కళాశాల, బీటీ యూనివర్సిటీలకు అదనంగా కేంద్రీయ విద్యాలయం మంజూరుతో మదనపల్లె ఎడ్యుకేషనల్ హబ్‌గా మారింది. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే ఇది సాధ్యమైంది. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలన్న ఆయన సంకల్పమే ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు మదనపల్లెకు రావడమే కాకుండా విద్యార్థులకు స్థానికంగా ఉన్నత చదువులు చదివే అవకాశం కలిగింది.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు : మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు మదనపల్లె–చిత్తూరు జాతీయరహదారిపై హైవేకు ఆనుకుని రెవెన్యూ అధికారులు 6.9 ఎకరాల భూమిని సిద్ధం చేశారు. ఇప్పటికే కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి హైదరాబాద్, తిరుపతి నుంచి ఉన్నతాధికారులు వచ్చి స్థలపరిశీలనతో పాటుగా వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు తాత్కాలిక భవనాలను పరిశీలించారు. అందులో భాగంగా పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో నూతనంగా నిర్మాణం జరుపుకున్న ఓ భవనాన్ని ఎంపికచేశారు. కేంద్రీయ విద్యాలయాన్ని తాత్కాలికంగా ప్రారంభించేందుకు అవసరమైన తరగతి గదులు, ఇతర మౌలికవసతుల నిర్మాణానికి రూ.50 లక్షలకు పైగా ఖర్చుచేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచారు. కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈనెల 20న ఢిల్లీలో కేంద్రప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ ఆధ్వర్యంలో జరిగిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్(పీఐబీ) మీటింగులో డెప్యూటీ డైరెక్టర్ జనరల్ హేమాజైస్వాల్ దేశవ్యాప్తంగా 87 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులను వెలువరించారు. అందులో ఆంధ్రప్రదేశ్‌లో అనకాపల్లె, సత్యసాయి జిల్లా పాలసముద్రం, గుంటూరు తాళ్లపల్లె, కృష్ణాజిల్లా నందిగామ, నరసారావుపేట రొంపిచెర్ల, ఏలూరుజిల్లా నూజివీడు, నంద్యాల జిల్లా డోన్‌లతో పాటుగా అన్నమయ్యజిల్లాలోని మదనపల్లెకు అనుమతులు మంజూరు చేశారు.

మోకాలడ్డిన టీడీపీ ప్రభుత్వం

మదనపల్లెకు కేంద్రీయ విద్యాలయంను ఉమ్మడిచిత్తూరుజిల్లాలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కేంద్రప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు చేయించారు. అయితే స్థలసేకరణకు సంబంధించి అప్పటి టీడీపీ ప్రభుత్వం, స్థానిక రాజకీయ నాయకులు అప్పటి కలెక్టర్‌పై ఒత్తిడి పెంచి స్థలసేకరణ జరపకుండా అడ్డంకులు సృష్టించారు. అయినప్పటికీ ఎంపీ మిథున్‌రెడ్డి కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై తనప్రయత్నాలు కొనసాగిస్తూనే వచ్చారు. ఎట్టకేలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, లోక్‌సభలో వైఎస్సార్ సీపీ లోక్‌సభపక్షనేతగా మిథున్‌రెడ్డి ఎంపికవడం, కేంద్ర మంత్రులతో ఆయనకున్న వ్యక్తిగత పరిచయాలతో తిరిగి కేంద్రీయ విద్యాలయం అంశాన్ని తెరపైకి తేవడమే కాకుండా స్థలసేకరణతో పాటు తాత్కాలికభవన నిర్మాణానికి నిధులు, నేడు పాలనాపరమైన అనుమతులు మంజూరు చేయించారు.

మదనపల్లెపై సీఎం ప్రత్యేక దృష్టి



మదనపల్లె నియోజకవర్గంపై సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ, దృష్టి కనబరుస్తున్నారు. ఇక్కడ అభివృద్ధికి సంబంధించి ఏ ప్రతిపాదన తీసుకెళ్లినా అన్నింటికి అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఇప్పటికే కోట్ల రూపాయల నిధులతో ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, సచివాలయ, ఆర్‌బీకే భవనాలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు, బీఎంసీలు ఏర్పాటు చేశారు. విద్య, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తూ మెడికల్ కళాశాల, బీటీ యూనివర్సిటీ, కేంద్రీయ విద్యాలయానికి స్థలం మంజూరుకు చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గాన్ని నాలుగేళ్లలో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపాం. – ఎంపీ మిథున్‌రెడ్డి

ఎంపీ సహకారం మరువలేనిది



నియోజకవర్గ అభివృద్ధిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారం మరువలేనిది. అభివృద్ధికి సంబంధించి ఏ ప్రతిపాదననైనా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అడిగిన దానికంటే ఎక్కువగానే మంజూరు చేయించారు. పడమటి నియోజకవర్గాల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సూపర్‌స్పెషాలిటీ మెడికల్ కాలేజీ, మదనపల్లె–తిరుపతి ఫోర్‌లేన్స్ రహదారి, కేంద్రీయ విద్యాలయం, వార్డుల్లో ఎంపీ నిధులతో మినరల్‌వాటర్ ప్లాంట్లు, ఇతర అభివృద్ధిపనులన్నీ ఎంపీ చొరవతోనే సాధ్యమయ్యాయి. – ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మదనపల్లె

సేవా గుణం అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పేదలకు బ్రెడ్లు, పాలు అందిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సాయి నారాయణ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నుంచి వృద్ధులకు, వికలాంగులకు, అనాథలకు పాలు, రొట్టెలు పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ సాయి నారాయణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమంలో ఇప్పటి వరకు 2.50 లక్షల మందికిపైగా అన్నదానం చేశామన్నారు. పెళ్లి, పుట్టిన రోజులు జరుపుకునే వారు సాయి నారాయణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుపుకుని, ఆకలితో అలమటిస్తున్న వారికి అన్నదానం, సాయంత్రం బ్రెడ్లు, పాలు అందించడం వలన ఎంతో మంది ఆకలి తీరుతుందన్నారు. నిరుపేదలకు సేవ చేయడంలో అందరూ ముందుండాలన్నారు. కార్యక్రమంలో చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, కువైట్ శంకరాచారి, శ్రీధర్‌రాయల్, చంద్రశేఖర్, క్రిష్ణమూర్తి, సత్యసాయి సేవా సమితీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి సునీల్

గుర్రంకొండ : ప్రభుత్వ సబ్సిడీ పథకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి సునీల్ అన్నారు. మంగళవారం స్థానిక పశువైద్యకేంద్రంలో పాడిరైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం రైతుల కోసం పశుసంవర్ధకశాఖ తరపున సబ్సిడీ పథకాలు అందిస్తోందన్నారు. గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ల అభివృద్ధి పథకం, పందుల పెంపకం వంటి యూనిట్లు మంజూరు చేస్తుందన్నారు. ఒక్కో యూనిట్ ధర కనిష్టంగా రూ.20 లక్షల నుంచి గరిష్టంగా రూ. కోటివరకు ఉంటుందన్నారు. ఒక్కో యూనిట్‌పై ప్రభుత్వం 50 శాతం మేరకు సబ్సిడీ అందిస్తుందన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 4తేదీన రాయచోటిలోని శ్రీ సాయిశుభ కళ్యాణ మండపంలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. రైతులు అవగాహన సదస్సులో పాల్గొనాలని కోరారు.

50 శాతం సబ్సిడీతో గొర్రెలు, మేకల యూనిట్లు



పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీధర్ రెడ్డి

కురబలకోట : గ్రామీణ స్థాయిలో ఆర్థిక పురోగతి సాధించడానికి జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా 50 శాతం సబ్సిడీతో గొర్రెలు, మేకల యూనిట్లు మంజూరు చేయనున్నట్లు పశు సంవర్ధక శాఖ అంగళ్లు ఏడీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా ఔత్సాహిత రైతులను, నిరుద్యోగులను ప్రోత్సహించేందుకు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా సబ్సిడీతో కూడిన గొర్రెలు, మేకలు యూనిట్లను మంజూరు చేస్తుందన్నారు. ఒక్కో యూనిట్‌లో 500 గొర్రెలు, 25 పొట్టేళ్ల వరకు మంజూరు చేస్తారన్నారు. రూ.కోటి అంతకు మించి ప్రాజెక్టు విలువ ఉంటే గరిష్టంగా రూ.50 లక్షల వరకూ సబ్సిడీ ఇస్తారన్నారు. కోళ్ళ అభివృద్ధి పథకంలో కూడా రూ.50 లక్షల వరకు యూనిట్ మంజూరు చేస్తారన్నారు. గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు సబ్సిడీ ఉందన్నారు. పందుల పెంపకానికి రూ.60 లక్షల వరకు యూనిట్ మంజూరు చేస్తారన్నారు. పశుగ్రాస యూనిట్లకు కూడా గరిష్ఠంగా రూ.50 లక్షల సబ్సిడీ ఉంటుందన్నారు.

మహనీయుల ఆశయసాధనకు బహుజనసేన



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు

మదనపల్లె : కుల వ్యవస్థ, కులజాడ్యాన్ని రూపుమాపేందుకు బుద్ధుడు, పూలే, పెరియార్, సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ లాంటి మహనీయులు త్యాగాలు చేశారని, వారి ఆశయసాధనలో భాగంగా బహుజనసేన ఏర్పాటవుతోందని రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బహుజనసేన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు గొల్లపల్లెలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ర్యాలీగా సమావేశం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు మాట్లాడుతూ...దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక పరిణామాలకు, మూల కారణం కులవ్యవస్థని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అంబేద్కర్, పూలే, పెరియార్ మార్గం అనివార్యమన్నారు. కార్యక్రమంలో బహుజన సేన రాష్ట్రనాయకులు కొండపల్లి ఆనంద్, మైనారిటీ నాయకులు కరీముల్లా, రెడ్డిసంఘం గిరిధరరెడ్డి, వాల్మీకిసంఘం పులిశీన, యాదవ సంఘం రాఘవేంద్రయాదవ్, నాగి, కోనభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలతో ప్రమాదాలు దూరం

కురబలకోట : రోడ్డు భద్రత నియమాలతో ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చని రూరల్ సర్కిల్ సీఐ శివాంజనేయులు, ముదివేడు ఎస్ఐ మబీన్ తాజ్ తెలిపారు. మంగళవారం వారు విశ్వం కళాశాల వద్ద వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ డ్రైవింగ్ వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సుతో పాటు రికార్డులు తప్పని సరిగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

మంచి చేసే ప్రభుత్వాన్ని ఆదరించండి

పీలేరు : మంచి చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు జీ.వి. రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీలేరు పట్టణంలోని కట్టుకాలువ వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షాకీర్, సహదేవరెడ్డి, మునీర్, హబీబ్, షాజహాన్, వేణుగోపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నిరకాల ఆరోగ్య సమస్యలకు చికిత్స



కేవీపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



గుర్రంకొండ : మాట్లాడుతున్న జిల్లా సర్వేఅధికారి

పెద్దమండ్యం : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి చికిత్స అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను ఏర్పాటు చేసినట్లు మండల ప్రత్యేక అధికారి రవి అన్నారు. మండలంలోని బండమీదపల్లె పంచాయతీ తురకపల్లె ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను ప్రారంభించారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన స్టాల్‌ను ప్రత్యేక అధికారి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఎంఈవో 2 రామక్రిష్ణ, , డాక్టర్‌లు ఇమ్మాన్యుల్, హరివర్మ, నజ్మ, ప్రవీణ్, సిహెచ్‌వో క్రిష్ణయ్య, సర్పంచ్ మొలక బయ్యారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

కేవీపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం కేవీపల్లె గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేయడం తోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహులు, ఎంపీపీ ఈశ్వరమ్మ, ఏఎంసీ ఛైర్మన్ యల్లయ్య, సర్పంచ్ నాగలక్ష్మీ పాల్గొన్నారు.

కలికిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కలికిరి–2 గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య శిబిబిరానికి 358 మంది రోగులు హాజరయ్యారు.

బి.కొత్తకోట: మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ వడిగలవారిపల్లెలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

కలకడ: మండలంలోని ముడియంవారిపల్లి గ్రామ సచివాలయంలో స్థానిక సర్పంచ్ శాంతమ్మ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహించారు.

తంబళ్లపల్లె: మండలంలోని గుండ్లపల్లె గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక



మహమ్మద్‌ఖాన్ ముబారక్‌బాషా అమర్‌నాథ్‌రెడ్డి బి.వి. రమణ

మదనపల్లె : పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌కు అవార్డుల పంట పండింది. పాఠశాలలో ఇంగ్లీషు, హిందీ టీచర్లుగా పనిచేస్తున్న పఠాన్‌మహమ్మద్‌ఖాన్, షేక్ ముబారక్‌బాషాలు రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం వైఎస్సార్‌కడపజిల్లా జెడ్పీ నుంచి ఈ మేరకు సమాచారం అందింది. అక్టోబర్ 5న అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా వీరు అవార్డు అందుకోనున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా అమర్‌నాథ్‌రెడ్డి

ములకలచెరువు : మండలంలోని నాయనచెరువుపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు అమర్‌నాథ్‌రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. గత 20 ఏళ్లగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆయన విధులు నిర్వహించారు. విద్యలో ప్రతిభ కనబరచిన పేద విద్యార్థులకు సైతం ఆర్థికంగా ఆదుకున్నారు. ఈ నెల 5వ తేదీ అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా కడప జెడ్పీ కార్యాలయంలో అవార్డు అందుకోనున్నారు. మంగళవారం ఎంఈఓ వెంకటరమణ, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా బి.వి. రమణ

పీలేరు : మండలంల్నో జంగంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బి.వి. రమణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. అంతర్జాయతీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన అవార్డు అందుకోనున్నారు. విద్యార్థుల ప్రగతికి వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేసినందుకు గానూ ఆయన అవార్డుకు ఎంపికయ్యారు.

కొత్త పోలింగ్ స్టేషన్లకు ప్రతిపాదనలు

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : పట్టణంలో కొన్నేళ్లుగా 3 నుంచి 4 కిలో మీటర్ల దూరంలో, ఒకేచోట అధికసంఖ్యలో ఉన్న పోలింగ్ కేంద్రాల స్థానంలో ప్రజల సౌకర్యార్థం వారి నివాస ప్రాంతాలకు దగ్గరలో కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆర్డీఓ ఎం.ఎస్.మురళి తెలిపారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏఈఆర్వో, సూపర్‌వైజర్లు, వివిధ రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. బీఎల్వోల ఇంటింటి సర్వేలో గుర్తించిన అంశాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పీలేరు సర్పంచ్‌గా జీనత్



పీలేరు : పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ షఫీ సతీమణి జీనత్ ఈ నెల 5న బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. ఇది వరకు సర్పంచ్‌గా ఉన్న హబీబ్‌బాషా సెలవుపై వెళ్లనున్నట్లు తెలిసింది. ఉప సర్పంచ్‌గా ఉన్న జీనత్‌బీ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు సమాచారం.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్

పీలేరు : గ్రామ పంచాయతీ కార్మికుల సేవలు అభినందనీయమని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో 120 మంది పంచాయతీ కార్మికులకు సబ్బులు, నూనె, బట్టలు, చెప్పులతో కూడి బ్యాగులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రజారోగ్యాన్ని కాపాడడంతో తమదైన పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, నాయకులు శ్రీనాథరెడ్డి, కాలేషా, అబీద్, మల్లికార్జునరెడ్డి, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలోని బద్దిపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని కమిషనర్ పీఆర్.మనోహర్ అన్నారు. మంగళవారం ఆయన బద్దిపల్లెలో పర్యటించి నీటి సమస్యలపై పరిశీలించారు. ఇక్కడి కుటుంబాలకు నీటిని అందించే బోరు చెరువునీటిలో మునిగివుండటంతో ప్రత్యామ్నయంగా చేపట్టాల్సిన చర్యలపై ఏఈ రాజేంద్రతో చర్చించారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట సమీపంలో కర్ణాటక రాష్ట్రం నుంచి 90 మిల్లీల 192 మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న రాజారెడ్డి (44)ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవీంద్రబాబు మంగళవారం పేర్కొన్నారు. అలాగే బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రంకు చెందిన గూటం వెంకటేష్ (35) కర్ణాటక రాష్ట్రం చేలూరు నుంచి 96 మద్యం ప్యాకెట్లను తరలిస్తుండగా నవాబుకోట పంచాయతీ వరికసువుపల్లి వద్ద అరెస్టు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

పారిశుధ్య సమస్యలకు ప్రాధాన్యం

నిమ్మనపల్లె : పంచాయతీ పరిధిలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రెడ్డివారిపల్లె సర్పంచ్ రెడ్డెమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు నరేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్యసురక్ష, జగనన్న స్వచ్ఛ సంకల్పంపై స్థానికులకు అవగాహన కల్పించారు.

బహిరంగ వేలం
అక్టోబరు నెల తేదీలు : 04th,11th,18th & 25.10.2023

Veh. No.	Vehicle Description	Year
AP03TE2876	ACEMEGA	2015
AP02Y6406	EICHER 11.10 FBT	2013
AP39X4509	EICHER PRO 1110 FBT	2019
AP39UL8978	MARUTI EECO-P	2011

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.,
డి.నెం. 19-3-13/8, 1వ అంతస్తు, హోండా షోరూమ్ దగ్గర, రేణిగుంట రోడ్డు, తిరుపతి-517501, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 0877-2221287, మొబైల్: 9000080798

